క్లుప్తంగా

పట్టణవాసుల సమస్యలు పరిష్కరించండి



వార్డుల్లో ప్రజల సమస్యలను తెలుపుతున్న సీపీఎం నాయకుడు ఎన్వైనాయుడు

సాలూరు: పట్టణంలో పేరుకుపోతున్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్వైనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని 6,7,8 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డుల్లో డ్రైనేజీ, తాగునీరు తదితర అనేక సమస్యలతో ఆయా వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నార న్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజందరితో కలిసి భవిష్యత్‌లో ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బోల్తాపడిన ఆటో



రోడ్డుపై బోల్తాపడిన ఆటో

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట-జోగింపేట గ్రామాల మధ్య జాతీయ రహదారిలో బుధవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి ఆటోలో ఎవరూలేని సమయంలో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి గోతిని తప్పించ బోతుండగా అదుపుతప్పిన ఆటో బోల్తా పడింది. ఆటోడ్రైవర్ సురక్షితంగా బయటపడడంతో చూపరులంతా ఊపిరి పీల్చుకున్నారు.

మామిడిపల్లి టు విజయవాడ సైకిల్ యాత్ర



విజయవాడ కనక దుర్గ గుడికి సైకిల్‌పై బయలు దేరిన భవానీ భక్తులు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామం నుంచి భవానీ మాలలో ఉన్న భక్తులు బుధవారం సైకిల్ యాత్ర ప్రారంభించారు. మామిడిపల్లి నుంచి విజయవాడలోని కనకదుర్గ గుడికి సైకిల్‌పై వెళ్లి మొక్కు తీర్చుకుంటున్నట్లు గురు భవానీలు ఎస్.నాగరాజు గౌరీశంకర్, కోరాడ వరుణ్ కుమార్ తెలిపారు. ప్రతి ఏటా మామిడిపల్లిలో నెలరోజుల పాటు భవానీ దీక్షలు అత్యంత భక్తి శ్రద్ధలతో చేస్తుంటారు.

కోతకు సిద్ధంగా వరిచేలు



వెంకటాపురంలో వెన్నుదశలో వరి పంట

సీతానగరం: మండలంలో ఆదిలో వేసిన వరిచేలు పొలాల్లో కోతకు సిద్ధమవుతున్నాయి. ఎక్కువ విస్తీర్ణంలో రైతులు వరిసాగు చేశారు. గ్రామాల్లో కార్తిల ఆధారంగా ఉభాలు చేయడంతో వరిచేలు పక్వదశకు రావడంతో 15 రోజుల్లో కోతకు సిద్ధమవుతున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సత్వర చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడ ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తుందోనని రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.



మహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షమ్మ తల్లి



కామాక్షమ్మ ఆలయంలో జరుగుతున్న సామూహిక కుంకుమ పూజ



విజయదుర్గా ట్యాక్సీ స్టాండ్ వద్ద పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తదితరులు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

సాలూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో వైభవంగా జరుగుతున్నాయి. కామాక్షమ్మ ఆలయంలో, పంచముఖేశ్వరస్వామి,దుర్గా ఆలయంలో గల ప్రత్యేక మంటపాల్లో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కామాక్షమ్మ ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన, ఇతర ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

అమ్మలు గన్న అమ్మ దుర్గమ్మ చల్లని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రార్థించారు. ఈ మేరకు పట్టణంలో అఫీషియల్ కాలనీలో కొలువుదీరిన దుర్గాదేవికి సోమవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మంగళవారం రాత్రి పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ సమీపంలో విజయదుర్గా ట్యాక్సీ స్టాండ్ వద్ద కొలువుదీరిన దుర్గాదేవిని రాజన్నదొర దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

డొంకల వెలగవలసలో విద్యుత్ సమస్య

సాలూరు రూరల్: మండలంలోని పట్టుచెన్నూరు పంచాయతీ డొంకల వెలగవలస గ్రామంలో వారం రోజులుగా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతుండడంతో గ్రామ యువకులు సాలూరు పట్టణంలోని ఎ.డి కార్యాలయానికి బుధవారం వచ్చి తమ గోడు వినిపించుకున్నారు. వర్షాలు పడితే తమ గ్రామానికి ఎప్పుడూ ఇదే పరిస్థితి వస్తుందని దీనిపై ఎన్నోమార్లు విన్నవించామని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో 24 చుట్టుపక్కల గ్రామాలన్నింటికి విద్యుత్ లైన్ ఇచ్చారని ఒక్క డొంకల వెలగవలస గ్రామానికి లైన్ ఇవ్వలేదని చెప్పారు. ఈ విషయమై కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏఈకి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చామన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేస్తే విద్యుత్ లైన్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ సమస్యతో గ్రామంలో తాగునీటికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌దే తప్పు

లైన్ ఇన్‌స్పెక్టర్ గుర్రయ్య చేసిన తప్పుతో డొంకల వెలగవలసకు విద్యుత్ సమస్య వచ్చింది. అన్ని గ్రామాలకు విద్యుత్ లైన్లు ఇచ్చినప్పుడు డొంకల వెలగవలస గ్రామాన్ని చూపించాల్సిన బాధ్యత లైన్ ఇన్‌స్పెక్టర్‌కు ఉంది. లైన్ వేయించకుండా ఇప్పుడు గ్రామస్తులను సబ్‌స్టేషన్‌కు వెళ్లి ఏఈని అడగండని అందరినీ పంపిస్తున్నాడు. ఆయన చేసిన తప్పుతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం ఆలస్యంగా తెలిసింది. -బి.నాగేశ్వరరావు, ఏఈ



సాలూరు సబ్‌స్టేషన్ వద్దకు ఏఈకి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చి తమ సమస్యను చెప్పుకుంటున్న డొంకల వెలగవలస గ్రామస్తులు

కుళ్లిపోతున్న పత్తికాయలు

● ఆందోళనలో రైతులు

సాలూరు రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో పత్తికాయలు కుళ్లిపోతున్నాయి. పత్తికాయలు బొగడలు వచ్చే సమయంలో వర్షాలు పడుతుండడంతో పత్తి నల్లగా మారిపోతోంది. మొదటి దశలో ఏరాల్సిన పత్తి వర్షాల కారణంగా తడిచి నాణ్యత తగ్గుతోందని రైతులు వాపోతున్నారు. సరిగా వీడని పత్తి కాయలను ఏరి ఇంటి వద్దకు తెచ్చుకుని కాయనుంచి పత్తిని వేరుచేసుకోవాల్సిన పరిస్థితి వస్తోందని దీంతో కూలీల ఖర్చుతో పాటు పత్తి నాణ్యత కోల్పోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తుండడంతో పంటకు వచ్చిన పత్తిచేలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రతి ఏటా రైతుకు ఒక పంట కలిసివస్తుందనుకుంటే మరో పంట నష్టపోవావాల్సి వస్తోందని సమయానికి వర్షాలు లేక ఈ ఏడాది ఉభాలు ఆలస్యం కాగా ఇప్పుడు వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో పత్తిచేలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పత్తి చేల నుంచి తడిచిన కాయలను ఇంటికి తెచ్చి పత్తిని వేరు చేస్తున్న మహిళా రైతు



కూర్మరాజుపేటలో వర్షాలకు కుళ్లుతున్న పత్తి కాయలు

రక్తహీనత నివారణకు చర్యలు

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో రాష్ట్రీయ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార నిర్వాహణపై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉదయకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెదభోగిలి పంచాయతీలో కుక్కల బెడద

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలో వీధికుక్కల బెడద నుంచి తమను రక్షించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం స్వచ్ఛంద సేవా కార్యకర్త సవరపు రామారావు మండల పరిషత్‌లో వివిధ సమస్యలపై ఎంపీడీఓ కార్యాలయం ఏఓ వెంకటరమణకు వినతిపత్రం అంద జేశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ పెదభోగిలి పంచాయతీ బుడ్డిపేట, అప్పయ్యపేట, సీతానగరం, పెదభోగిలి గ్రామాల్లో కుక్కలు మూకుమ్మడిగా చేరి యాదవకులస్థులు మేక పిల్లలు భద్రపర్చుకునే కొట్టంలో చొరబడి గాయాలు చేస్తున్నాయని, చిన్న పిల్లలు వీధుల్లో తిరుగాడుతున్న సమయంలో దాడులు, చేస్తుండడంతో గాయాలపాలవుతున్నారన్నారు. కుక్కలు వీధుల్లో తిరుగాడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని తెలియజేశారు. సువర్ణముఖి నదిలో ప్రజలు స్నానాలు చేసే నీలాటి రేవుల్లో పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరగడం, పొదల్లో పాములు చేరడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. తక్షణమే సంబంధిత అధికారులు దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



స్వైరవిహారం చేస్తున్న కుక్కల గుంపు

జీఎస్టీపై ప్రజలకు అవగాహన



సీతానగరం: జీఎస్టీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ఎస్.అవినాష్



మక్కువ: పాపయ్యవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

● కాశీపట్నం సచివాలయం సందర్శన

మక్కువ: మండలంలోని కాశీపట్నం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ అర్జునరావు మంగళవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజా సమస్యలను తెలుసుకుని, సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయాధికారిణి చింతల భారతి, ఉద్యానవన శాఖ అధికారి ప్రత్యూష ఆధ్వర్యంలో పాపయ్యవలస గ్రామంలో జీఎస్టీపై ర్యాలీ నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో, ట్రాక్టర్‌పై రూ.42వేలు, ట్రాక్టర్ల టైర్లపై రూ.6,500, నీటిపారుదల పంపులపై రూ.3000 తగ్గుతుందన్నారు. గతనెల 22వ తేదీ నుంచి ఈ పద్ధతి అమల్లోకి వచ్చిందని తెలిపారు.

సీతానగరంలో..

సీతానగరం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ సంస్కరణలు చేయడంతో వ్యవసాయ పనిముట్ల కొనుగోలుపై అవగాహన కల్పించు కోవాలని మండల వ్యవసాయశాఖ ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు చినభోగిలి రైతు సేవా కేంద్రం ఆవరణలో బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ కురమాన శ్రీనివాసరావు, రైతులు, పశువైద్య శాఖ సహాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ర్యాలీ చేస్తే కేసులు

పార్వతీపురం రూరల్: ప్రభుత్వం వైద్య కళాశాలల పీపీపీ లీజు నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడపాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం, పీడీఎస్ఓ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీని అనుమతులు లేకుండా నిర్వహించడం పట్ల రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, శ్రీను నాయుడులతో పాటు మరికొందరు పై కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం సీఐ కె.మురళీధర్ తెలిపారు. 30 యాక్ట్ కింద అనుమతులు లేకుండా నిరసన కార్యక్రమాలు నిర్వహించడం పట్ల కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు నిబంధనలు పాటించకుండా, అనుమతులు లేకుండా కార్యక్రమాలను నిర్వహించారదని పట్టణ పోలీసులు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఏవో భారతి

మక్కువ: సమాచార హక్కు చట్టంపై ఏవో చింతల భారతి ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం 2005లో అమల్లోకి వచ్చిందన్నారు. పంచాయతీలు, మున్సిపాల్టీలతోపాటు, పలు ప్రాంతాలలో చేపట్టిన పనులపై సరైన సమాచారం తెలుసుకోవాలంటే, సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. ఓ పౌరుడు సమాచారహ క్కు చట్టం ద్వారా ధరఖాస్తు చేసుకున్న 30రోజుల్లోగా సమాచారం అందించా ల్సిన బాధ్యత, ఆశాఖకు చెందిన అధికారులకు ఉంటుందన్నారు. తప్పుడు సమాచారం అందించినా, సమాచారం ఇవ్వకపోయినా అధికారులపై జరిమానా విధించే అవకాశముందన్నారు. ప్రభుత్వ పనుల్లో పారదర్శకత, అవినీతి నిరోధించేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందని వివరించారు.

ఓట్ చోరీతో గద్దెనెక్కిన మోదీ

గుమ్మలక్ష్మీపురం: కేంద్రంలోని నరేంద్ర మోదీ నాయకత్వంలో గల బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాసించేలా ప్రజల ఓట్లను దోచుకుని ముచ్చటగా మూడోసారి గద్దెనెక్కిందని, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడి లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించి, ఉన్న ఓట్లను తొలగించి బీజేపీ ఓట్ చోరీకి పాల్పడిందని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ చోరీ చేయడం వలన నిజమైన ఓటర్లు వారికి నచ్చిన నాయకులను ఎన్నుకునే అధికారాన్ని కోల్పోయారన్నారు.

ఈ నేపథ్యంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఓటర్ల జాబితా అవకతవకలపై దేశవ్యాప్త ఉద్యమానికి పూనుకుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు పత్తిక లక్ష్మయ్య, కిల్లక లక్ష్మయ్య, ఆరిక ధర్మారావు, యువజన విభాగం నాయకుడు కోలక జయరాం, మహిళా విభాగం నాయకురాలు నిమ్మక పెంటమ్మ మన్నగు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



గుమ్మలక్ష్మీపురంలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌లను విడుదల చేస్తున్న ఎంపీపీ దీనమయ్య తదితరులు

గుమ్మలక్ష్మీపురం: అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని ఎంపీపీ కుంబురుక దీనమయ్య పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి డిజిటల్ బుక్ ఈ క్యూ ఆర్ కోడ్‌లను ఎంపీపీ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు పరుస్తూ ప్రశ్నించే గొంతులపై అఘాయిత్యాలకు పాల్పడుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అధికార పార్టీ వారి ద్వారా దాడులు, అన్యాయం ఎదురైనా, అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. ఈ డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ఫోన్ ద్వారానే స్కాన్ చేసి ఫిర్యాదును అప్‌లోడ్ చేయాలని, అటువంటి ఫిర్యాదులపై తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విచారించి న్యాయం చేసేలా తమ అధినేత జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ విధానాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, పార్టీ శ్రేణులు గోరిశెట్టి గిరిబాబు, తోయక గోపాల్, పసుపురెడ్డి మహేష్, నిమ్మక కృష్ణ తదితరులతో పాటు సర్పంచ్‌లు బొత్తాడ గౌరీశంకరరావు, ఆర్ఎస్ చైతన్య స్రవంతి పాల్గొన్నారు.

● ఆదమరిస్తే ప్రాణాలు గాలిలోకే



జాతీయ రహదారిపై చినభోగిలి వద్ద ప్రమాదకరంగా గోతులు



రెస్టారెంట్ గేటుకు ఎదురుగా ప్రాణాంతకమైన గొయ్యి

సీతానగరం: మండలంలోని జాతీయరహదారిపై ఏర్పడిన గోతుల్లో వాహన ప్రయాణికులు, దసరా ప్రయాణికులు ప్రయాణించేటప్పుడు ఆదమరిస్తే ప్రాణాలు గాలిలో కలిసిపోవడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. సీతానగరం ఫ్లైఓవర్ నుంచి కాశీపేట గ్రామంమధ్య బీటీ రోడ్డుకు రెండున్నర అడుగుల లోతులో గోతులు వారాయి. చినభోగిలి వద్ద నెల రోజుల క్రితం ఏర్పడిన గోతుల్లో రాతిబండలు వేసినా ప్రమాదాలు తప్పడం లేదు. అలాగే కాశీపేట సమీపంలో ప్రదీప్ రెస్టారెంట్, పెట్రోల్ బంకుల వద్ద భారీగా గోతులు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున రెస్టారెంట్ యాజమాన్యం గోతులవద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. అయినా ఈ ప్రాంతానికి కొత్తవారు వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కనీసం గోతులైనా పూడ్చి ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.